సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024



బ్రహ్మోత్సవాలపై బదిలీ ప్రభావం!
రామాలయ ఈఓ బదిలీ ప్రభావం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలపై పడుతుందని భక్తులు అంటున్నారు. 8లో



అన్నదాతలకు మిత్రులు !
మిరప కోతల కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలు ఉమ్మడి జిల్లా రైతులకు అండగా నిలుస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
33° / 18°

వాతావరణం
జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. రాత్రికి చలి ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా నిత్యకల్యాణం

భద్రాచలం: శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. అనంతరం అర్చకులు శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం చేశారు.

డీసీసీబీ చైర్మన్ పదవి గల్లంతు

'కూరాకుల' పిటీషన్‌ను డిస్మిస్ చేసిన హైకోర్టు?

ఖమ్మంవ్యవసాయం: డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం పదవులపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడినట్లేనని తెలుస్తోంది. రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా ఉన్న కూరాకులపై డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా ఆయన హైకోర్టును ఆశ్రయించారు. కొద్ది రోజులుగా వాదనలు కొనసాగుతుండగా, మంగళవారం పిటీషన్‌ను డిస్మిస్ చేసినట్లు తెలిసింది. కానీ సాయంత్రం వరకు అధికారికంగా జిల్లా సహకార శాఖకు, డీసీసీబీకి సమాచారం లేదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అయితే, నాగభూషణానికి డీసీసీబీ కేటాయించిన కారు, ఇద్దరు డ్రైవర్లు, పీఏ, నలుగురు అటెండర్లు మంగళవారం బ్యాంకులో రిపోర్టు చేశారు. దీంతో నాగభూషణం డీసీసీబీ చైర్మన్, వీవీ పాలెం పీఏసీఎస్ చైర్మన్ పదవులను కోల్పోయినట్లేనని తెలుస్తోంది.

గిరిజన విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

భద్రాచలంటౌన్: ఏజెన్సీ ప్రాంత గిరిజన విద్యార్థులకు ఐటీడీఏ ద్వారా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పీఓ ప్రతీక్ జైన్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కనీస సామర్థ్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థుల అనుభవాలను తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ జాన్‌మిల్టన్ పాల్గొన్నారు.

స్థిరపడదాం ముందు..

విద్య, ఉద్యోగం తర్వాతే పెళ్లి

- తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చడమూ ముఖ్యమే
- 'ఎస్‌బీఐటీ' డిబేట్‌లో విద్యార్థుల మనోభావాలు
- మారుతున్న యువత అభిరుచులకు సంకేతం



ఎస్‌బీఐటీలో నిర్వహించిన డిబేట్‌లో మాట్లాడుతున్న విద్యార్థులు, వేదికపై కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ, తదితరులు

యువత ఆలోచనా విధానాల్లో రోజురోజుకూ మార్పు వస్తోంది. గతంలో దూకుడుగా కనిపించడమే కాక చిన్న విషయానికైనా తల్లిదండ్రులను ఎదిరించాలనే ధోరణి ఉండేది. చదువుకుంటూనే ప్రేమించడం, జీవితంలో స్థిరపడకముందే అందరినీ ఎదిరించి పెళ్లి చేసుకోవడం సాధారణంగా కనిపించేది. కానీ ప్రస్తుత యువతలో చదువు, ఆపై ఉద్యోగంతో జీవితంలో స్థిరపడడమే ప్రధానమనే భావన వ్యక్తమవుతోంది. ఆ తర్వాత ప్రేమ, పెళ్లి ఆలోచనలు చేయాలని చెబుతున్నారు. నేడు(బుధవారం) వాలంటైన్స్ డే సందర్భంగా ఖమ్మంలోని స్వర్ణభారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఎస్‌బీఐటీ)లో సాక్షి మీడియా ఆధ్వర్యాన 'ప్రేమ పెళ్లి – పెద్దల పెళ్లి' అంశంపై డిబేట్ నిర్వహించగా.. విద్యార్థులు ఎక్కువ మంది పెద్దలు కుదిర్చిన పెళ్లి వైపే మొగ్గుచూపారు. ఒకవేళ ప్రేమవివాహం చేసుకున్నా జీవితంలో స్థిరపడ్డాకే ఆలోచన చేయాలనే భావన వ్యక్తం చేశారు. – ఖమ్మంసహకారనగర్

తల్లిదండ్రులు అన్నీ ఆలోచిస్తారు



తల్లిదండ్రులెవరైనా అన్నివిధాలా ఆలోచించాకే పెళ్లి చేస్తారు. కుటుంబం, విలువలు.. ఇలా అన్ని అంశాలను పూర్తిస్థాయిలో పరిశీలించాకే పిల్లల వివాహాలు నిశ్చయిస్తారు. అందుకే పెద్దలు నిశ్చయించిన పెళ్లిళ్లే మంచివి. ఈ విషయాన్ని యువత గుర్తించాలి.

– సీహెచ్.స్రవంతి, ఎంబీఏ

చదువు తర్వాతే..



ప్రతీ ఒక్కరు చదువుపై దృష్టి సారించాలి. ఆ తర్వాత మనం ఉన్నత స్థానాలకు చేరాక అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉంది. మన భవిష్యత్‌పై అన్ని రకాలుగా ఆలోచించాక తల్లిదండ్రులే నిర్ణయిస్తారు. వారి నిర్ణయాన్ని గౌరవించాలి.

– టి.ఉషారాణి, ఎంబీఏ

తప్పేమీ కాకున్నా..



ప్రేమ పెళ్లిళ్లు తప్పని చెప్పలేం. ప్రేమ వివాహం చేసుకోవాల్సి వస్తే తల్లిదండ్రులకు తెలియజేసి వారి అంగీకారంతో చేసుకుంటే భవిష్యత్ బాగుంటుంది. తొందరపడకుండా భవిష్యత్ జీవితంపై అన్నిరకాలుగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటే అందరికీ మంచిది.

– సీహెచ్.తేజస్వి, బీటెక్

పిల్లలే తల్లిదండ్రుల లోకం



తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్ కోసం ఎన్నో రకాలుగా ఆలోచిస్తారని.. తమ సంతోషాలను త్యాగం చేస్తారని విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇదే తరహాలో పెళ్లి విషయంలో పిల్లలు బాగుండాలని తపిస్తారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని తల్లిదండ్రుల సలహాలు, సూచనలతో ముందుకు సాగితే ఉన్నత స్థానాలకు చేరడం.. ఆ తర్వాత వారు నిర్ణయించిన వివాహం చేసుకుంటే కుటుంబం అండ ఉంటుందని తెలిపారు. ఇక ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నత చదువు ఎంత ముఖ్యమో ఉద్యోగాన్ని సాధించడం కూడా అంతే ముఖ్యమని వెల్లడించారు. హోదాతో గౌరవం వస్తుందని, అప్పుడు ప్రేమ పెళ్లి చేసుకున్నా తల్లిదండ్రుల నుంచి అభ్యంతరాలు ఉండవని పేర్కొన్నారు. అందుకే ప్రేమను చంపుకోవాల్సిన పని లేదని.. జీవితంలో స్థిరపడి.. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటే అందరికీ మంచిదనే భావన వ్యక్తం చేశారు.

జీవితంలో అన్నీ ముఖ్యమే



జీవితంలో చదువు, ఉద్యోగంతో పాటు ప్రేమను కూడా ఓ భాగంగా చూడాలి. ఎదుటి వ్యక్తులు ఇచ్చే సూచనలు మనల్ని మంచి స్థానాలకు తీసుకెళ్లే అవకాశం కూడా ఉంటుంది. మంచీచెడులు బేరీజు వేసుకోగలిగి ముందుకు సాగితే ప్రేమ తప్పేమీ కాదు. – రాజేష్‌శర్మ, ఎంబీఏ

ప్రేమ గొప్పదే..



జీవితంలో ప్రేమ చాలా గొప్పదనే చెప్పాలి. అయితే, ప్రేమించే అర్హత ఉందని భావించినప్పుడే ముందుకు సాగాలి. చదువు పూర్తిచేయడం.. ఆపై ఉద్యోగం సాధించడం ముఖ్యం. అనంతరం జీవితంలో స్థిరపడ్డామనే నమ్మకం ఏర్పడినప్పుడు పెళ్లి చేసుకోవాలి.

– అమీర్, బీటెక్

స్థిరపడ్డాకే పెళ్లి..



పెద్దలు కుదిర్చిన వివాహమే గొప్పదిగా భావించొచ్చు. తల్లిదండ్రులు మన భవిష్యత్‌ను ఆలోచించి తీసుకునే నిర్ణయాల్లో వివాహం ముఖ్యమైనది. అయితే, ప్రేమ పెళ్లి తప్పు కాకపోయినా జీవితంలో స్థిరపడ్డాకే వివాహం చేసుకుంటే భవిష్యత్ బాగుంటుంది. – రిషి, బీటెక్

మంచి స్థాయికి చేరితేనే..



సమాజంలో పెద్దలు కుదిర్చిన పెళ్లికే విలువ. తల్లిదండ్రులు అన్నీ ఆలోచించి వివాహం చేయడంతో పాటు కష్టసుఖాల్లో జంటకు అండగా నిలుస్తారు. ప్రేమ వివాహాల్లో అలాంటివి ఉండవు. ఒకవేళ ప్రేమించినా పెద్దల అంగీకారంతో వివాహం చేసుకుంటే మంచిది.

– వర్షిణి, బీటెక్

అలరించిన కీర్తనలు

రెండోరోజూ కొనసాగిన రామదాసు జయంత్యుత్సవాలు



కీర్తనలు ఆలపిస్తున్న సంగీత కళాకారులు

భద్రాచలంటౌన్ : భద్రాద్రి శ్రీసీతారామచంద్రస్వామివారి ఆలయంలో భక్త రామదాసు జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న వాగ్గేయకారోత్సవాలు రెండోరోజు మంగళవారం వైభవంగా కొనసాగాయి. ప్రముఖ సంగీత విద్వాంసులు మల్లాది సోదరులు, దేవస్థానం స్థానాచార్యులు ఆలపించిన భక్త రామదాసు, తూము నరసింహదాసు కీర్తనలు అలరించాయి. హైదరాబాద్‌కు చెందిన సుందరి జానకీరామ్ బృందం, విద్వాన్ శ్రీ శేషం రమణ బృందం, శేషులత బృందం, శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి దేవస్థానం వారితో పాటు భాగ్యలక్ష్మి బృందం, చైన్నెకి చెందిన మద్రాస్ మ్యూజిక్ అకాడమీ స్టూడెంట్స్, భరత్ నారాయణ, విజయవాడకు చెందిన సుధాకర్ బృందం ఆలపించిన సంగీత కీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ

ఇద్దరికి స్వర్ణ, ఇద్దరికి కాంస్య పతకాలు



క్రీడాకారులతో కాశీహుస్సేన్

కొత్తగూడెంటౌన్: హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో నలుగురు జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చారని అంతర్జాతీయ మాజీ క్రీడాకారుడు కాశీ హుస్సేన్ మంగళవారం తెలిపారు. పోటీల్లో కె.లిఖిత్‌చరణ్, ఎం.గ్లోరీ ప్రశస్త బంగారు పతకాలు, సీహెచ్.అజయ్, సీహెచ్.విజయ్ కాంస్య పతకాలు సాధించారని వివరించారు. ఈ క్రీడాకారులను భద్రాద్రి కుంగ్‌ఫూ కరాటే అకాడమీ కోచ్, సెక్రటరీ పి.నీహారిక, జిల్లా మార్షల్ ఆర్ట్స్, క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందించారు.

రామభక్తులకు రైలు

- జిల్లా నుంచి అయోధ్యకు స్పెషల్ ట్రైన్
- 16న కొత్తగూడెం నుంచి బయలుదేరనున్న బండి
- 18, 19 తేదీల్లో బాలరామ దర్శన అవకాశం
- రాను, పోను కలిపి ఆరు రోజుల పాటు ప్రయాణం



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాముడి జన్మస్థలమైన అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగిన తర్వాత దేశమంతటా రామనామ స్మరణ పెరిగింది. బాల రామున్ని దర్శించుకునేందుకు భక్తులు ఉవ్విళ్లూరుతున్నారు. దీంతో రైల్వే శాఖ దేశం నలుమూలల నుంచి అయోధ్యకు ప్రత్యేక రైళ్లను నడిపిస్తోంది.

జిల్లా నుంచి ఈనెల 16న..

జిల్లా నుంచి అయోధ్యకు వెళ్లే ప్రత్యేక రైలు (నంబర్ 07223) ఈనెల 16 మధ్యాహ్నం 3 గంటలకు భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. డోర్నకల్, వరంగల్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్ల నుంచి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ మీదుగా ఉత్తరప్రదేశ్‌లోని సలార్‌పూర్ రైల్వే స్టేషన్‌కు 18వ తేదీ(ఆదివారం) తెల్లవారుజామున 3 గంటలకు చేరుకుంటుంది. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 16 కి.మీ. దూరంలో ఉన్న అయోధ్యకు భక్తులు వెళ్లాల్సి ఉంటుంది.

అయోధ్యలో రెండు రోజులు..

సలార్‌పూర్ నుంచి అయోధ్యకు భక్తులు ఆదివారం ఉదయానికి చేరుకుంటారు. ఆదివారం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు బాలరాముడి దర్శనంతో పాటు స్థానికంగా ఉన్న ఇతర ఆలయాలు, నదీ స్నానం, ఇతర పూజాదికాలు చేసుకునే అవకాశం ఉంటుంది. తిరిగి 19వ తేదీ(సోమవారం) మధ్యాహ్నం 2 గంటలకు సలార్‌పూర్ స్టేషన్‌లో బయలుదేరనున్న రైలు బుధవారం కొత్తగూడెం చేరుకుంటుంది. ఆరు రోజుల పాటు ప్రయాణ సమయం కాగా, మొత్తం రాను, పోను కలిపి 3,750 కి.మీ. ఉంటుంది. ఈ రైలులో 22 కోచ్‌లు అందుబాటులో ఉంటాయి. ఈ మేరకు రిజర్వేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా, మరిన్ని వివరాలకు భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్‌తో ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని రైల్వే శాఖ అధికారులు సూచించారు.

గతంలోనే కోరిన 'సాక్షి'

సీత సమేత శ్రీరాముడు కొలువైన భద్రాచల పుణ్యక్షేత్రం దక్షిణ అయోధ్యగా పేరు పొందింది. రామయ్య దర్శనం కోసం రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భద్రాచలం వస్తుంటారు. ఈ నేపథ్యంలో భద్రాచలం రోడ్ నుంచి అయోధ్యకు ప్రత్యేక రైలు నడిపించాలని గత జనవరి 2న ప్రత్యేక కథనం ద్వారా రైల్వే శాఖను 'సాక్షి' కోరింది. ప్రస్తుతం ప్రకటించిన ప్రత్యేక రైలు ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం కాజీపేట స్టేషన్ నుంచి నడిపించాల్సి ఉన్నప్పటికీ.. రామ భక్తుల కోరిక మేరకు భద్రాచలం రోడ్ స్టేషన్ నుంచి నడిపించాలని రైల్వేశాఖ నిర్ణయించింది.

తహసీల్దార్లు, ఎంపీడీఓలకు పోస్టింగ్

సూపర్‌బజార్(కొత్తగూడెం): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పలువురు తహసీల్దార్లు, ఎంపీడీఓలు బదిలీ కాగా, వారి స్థానంలో కొందరికి జిల్లాలోనే సర్దుబాటు చేయగా, మరికొందరు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన విషయం తెలిసిందే. జిల్లాకు వచ్చిన వారికి ఆయా మండలాలను కేటాయిస్తూ కలెక్టర్ ప్రియాంక ఆల మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

తహసీల్దార్లకు కేటాయించిన మండలాలిలా..

పేరు	మండలం
వి.వి.శకుంతల	ఆళ్లపల్లి
ఎండీ ముజాహిద్	బూర్గంపాడు
జి. వివేక్	పాల్వంచ
మేకల ఇమానుయల్	గుండాల
ఎన్. నాగభవానీ	టేకులపల్లి
కె.స్వాతిబిందు	జూలూరుపాడు
తోట సూర్యనారాయణ	పినపాక
సీహెచ్. నరేష్	కరకగూడెం
జి.జగదీశ్వర్	చండ్రుగొండ
కె. శ్రీనివాసరావు	దమ్మపేట
ఎం.శ్రీనివాస్	చర్ల తహశీల్దార్
డి. తిరుమలాచారి	కలెక్టరేట్ సూపరింటెండెంట్
ఎం.అశోక్‌కుమార్	కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయ డీఏఓ

ఎంపీడీఓల వివరాలిలా..

పేరు	మండలం
బయ్యవరపు అశోక్	చండ్రుగొండ
తెల్లూరి శ్రీనివాసరావు	మణుగూరు
కుడుముల విజయ భాస్కర్‌రెడ్డి	పాల్వంచ
భీంరెడ్డి రవీంద్రరెడ్డి	దమ్మపేట
కావూరి మహాలక్ష్మి	అన్నపురెడ్డిపల్లి
ఆర్.రమాదేవి	ఆళ్లపల్లి
వాసిరెడ్డి దుర్గ వెంకట అశోక్‌కుమార్	చుంచుపల్లి
కుడుముల జమలారెడ్డి	బూర్గంపాడు
రాఘవరపు రామకృష్ణ	పినపాక
మందగొండి చంద్రశేఖర్	దుమ్ముగూడెం
దుగ్గుల కరుణాకర్‌రెడ్డి	జూలూరుపాడు
జి.రవీంద్రరావు	టేకులపల్లి
బి.వి. చలపతిరావు	లక్ష్మీదేవిపల్లి
బి. భారతి	ములకలపల్లి
కె. ధన్‌సింగ్	ఇల్లెందు
కె. ఈదయ్య	చర్ల

33 మంది గ్రామ కార్యదర్శుల బదిలీ

చుంచుపల్లి: జిల్లాలో 33 మంది సీనియర్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేస్తూ కలెక్టర్ ప్రియాంక ఆల మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొన్ని సంవత్సరాలుగా గ్రామపంచాయతీల్లో పని చేస్తున్న కార్యదర్శుల ఆరోగ్యపరమైన అంశాలు, ప్రత్యేక విజ్ఞప్తుల మేరకు స్థానచలనం కల్పించారు. ప్రస్తుతం పని చేస్తున్న మండలాల నుంచి పక్క మండలాల పంచాయతీలకు బదిలీ చేశారు.

నిన్న నడిచింది.. నేటి నుంచి రద్దయింది !

25 వరకు విజయవాడ రైలుకు బ్రేక్

కొత్తగూడెంఅర్బన్: ఎంతోకాలంగా రద్దయిన భద్రాచలం రోడ్ – విజయవాడ ప్యాసింజర్ రైలు ఎట్టకేలకు మంగళవారం రాకపోకలు సాగించింది. అయితే తిరిగి బుధవారం నుంచి ఈనెల 25 వరకు రద్దు చేస్తూ వెంటనే నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు భద్రాచలం రోడ్ స్టేషన్ చీఫ్ కమర్షియల్ సూపర్‌వైజర్ జేమ్స్‌పాల్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అపురూపం.. అనిర్వచనీయం

■ కష్టసుఖాల్లో కలిసి ఉండడమే నిజమైన ప్రేమ ■ బేధాభిప్రాయాలు వచ్చినా అధిగమిస్తే ఆ బంధం కలకాలం

ప్రేమ రెండక్షరాలు.. రెండు హృదయాల స్పందన.. రెండు మనసుల్లో చెరిగిపోని మధుర జ్ఞాపకం! నీకు నేను.. నాకు నువ్వు అన్నట్లుగా కష్టసుఖాల్లో కలిసి ఉండడమే నిజమైన ప్రేమకు నిర్వచనం. ఎవరేం చెప్పినా ప్రేమ అనేది అద్భుతమైన, అపూర్వమైన భావన! కులమతాలు, ధనిక, పేద, వర్ణ తారతమ్యాలు, భాషా, ప్రాంతాలు, సంస్కృతీసంప్రదాయాలకు అతీతమైనది ప్రేమ. ఈ నేపథ్యాన నేడు(బుధవారం) ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రేమను గెలిపించుకుని విజయవంతంగా జీవనయానం సాగిస్తున్న పలువురి వివరాలను మీరూ చదవండి.



కష్టసుఖాల్లో కలిసి ప్రయాణం


ఎండీ.జానీబాబా, చీమల నాగరత్నం

ఇల్లెందు: కులమతాలు వేరైనా ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈ దంపతులు కష్టసుఖాల్లో కలిసి ప్రయాణం సాగిస్తున్నారు. ఇల్లెందు మండలం హనుమంతులపాడుకు చెందిన చీమల నాగరత్నం(రహీమున్నీసా బేగం) – భర్త మహ్మద్ జానీబాబా వేర్వేరు మతాలైనా ఆరేళ్లు ప్రేమించుకున్నాక పెద్దలను ఒప్పించి 1999లో రిజిస్టర్ వివాహం చేసుకున్నారు. పాతికేళ్ల వైవాహిక జీవితంలో ఒడిదొడుకులు వచ్చినా అరమరికలు లేకుండా అర్థం చేసుకోవటం, చర్చించుకుంటూ ముందుకెళ్లడంతో కాపురం సజావుగా సాగుతోందని వారు చెబుతున్నారు. ఇక వార్డు సభ్యురాలిగా రాజకీయ జీవితం ప్రారంభించిన రహీమున్నీసా ఇప్పుడు ఎంపీపీగా కొనసాగుతున్నారు. జానీబాబా కూడా మండల పరిషత్‌లో కోఆప్షన్ సభ్యుడిగా పనిచేశారు.

నీలాద్రి సాక్షిగా..


నరసింహారావు - లక్ష్మీప్రసన్న

సుజాతనగర్: మండల కేంద్రానికి చెందిన ఏనుగంటి నరసింహారావు, ఎర్రగుంటకు చెందిన లక్ష్మీప్రసన్నవి వేర్వేరు కులాలు. 2011 సంవత్సరంలో నీలాద్రి ఆలయంలో మొదలైన వీరి పరిచయం ఆ తర్వాత ప్రేమగా మారింది. వివాహనికి నరసింహారావు తల్లిదండ్రులు అంగీకరించినా లక్ష్మీప్రసన్న తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. ఎలాగైనా పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకుని కొన్నాళ్లు వేచి ఉండి మరీ ఇరువైపులా పెద్దలను ఒప్పించారు. ప్రస్తుతం వీరికి ఇద్దరు పిల్లలు చైత్ర, హర్ష ఉన్నారు.

ఆదర్శ జీవనం


వల్లాల మంగమ్మ - నర్సయ్య

ఇల్లెందురూరల్: ప్రేమించినంత తేలిక కాదు తల్లిదండ్రులను ఒప్పించడం.. అయినా ఓపికగా ఉండడంతో ప్రేమ వివాహం చేసుకున్నాక తల్లిదండ్రులను ఒప్పించడానికి ఏడాది సమయం పట్టింది అంటున్నారు ఇల్లెందు మండలం సుభాష్‌నగర్ మాజీ సర్పంచ్ వల్లాల మంగమ్మ, వల్లాల నర్సయ్య దంపతులు. సుభాష్‌నగర్‌కు చెందిన నర్సయ్య ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. 30 ఏళ్ల క్రితం తొలి చూపులోనే మంగమ్మతో ప్రేమలో పడగా, పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలని అనుకున్నారు. కానీ సమ్మతి లభించకపోవడంతో స్నేహితుల సమక్షాన వివాహం చేసుకోగా ఏడాది గడిచాక వీరి వివాహాన్ని పెద్దలు అంగీకరించారు. తొలినాళ్లలో ఇబ్బందులు ఎదురైనా భార్య అండతో కష్టాలను అధిగమించామని నర్సయ్య చెబుతున్నాడు. ఇక అనుకోకుండా వచ్చిన అవకాశంతో మంగమ్మ సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఎన్నిక కాగా.. ముప్పై ఏళ్లుగా ఒకే మాట, ఒకే బాటగా కొనసాగుతున్న ఈ దంపతులు నేటి తరం ప్రేమికులకు మార్గదర్శకులుగా నిలుస్తున్నారు.

విధినిర్వహణలో పరిచయం


కుమారుడితో పర్వీన్, జితేందర్

పాల్వంచరూరల్: విధి నిర్వహణ మొదలైన పరిచయం ప్రేమగా మారి పెళ్లి పీటల వరకు తీసుకెళ్లింది. ఖమ్మంలో ట్రెయినీ ఎస్ఐగా పనిచేస్తున్న జితేందర్ 2013లో ఖమ్మం కోర్టులో కేసుల నిమిత్తం హాజరవుతుండగా న్యాయవాది షాజహాన్ పర్వీన్‌తో పరిచయమైంది.అది కాస్తా ప్రేమగా మారి పెళ్లికి సిద్ధపడగా పర్వీన్ కుటుంబ సభ్యులు వ్యతిరేకించారు. అయినా పెద్దలను వ్యతిరేకించి 2015లో గుడిలో వివాహం చేసుకున్న వీరి దాంపత్య జీవితం 19 ఏళ్లుగా సాఫీగా సాగుతోంది. ప్రస్తుతం వీరికి ఓ కుమారుడు ఉండగా, జితేందర్ కొత్తగూడెంలో సైబర్ క్రైమ్ సీఐగా విధులు నిర్వర్తిండగా, పర్వీన్ కూడా జిల్లా కోర్టులో న్యాయవాదిగా కొనసాగుతున్నారు.



ఎల్లలు దాటిన ప్రేమ బంధం


రాజ్యలక్ష్మి - మ్యాథ్యూ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి అమ్మాయి.. అమెరికా అబ్బాయి ఒకరికొకరు ఇష్టపడి మనస్సులు కలవడంతో ఆ ప్రేమ ఎల్లలు దాటింది. సత్తుపల్లికి చెందిన రిటైర్డ్ వెటర్నరీ ఉద్యోగి పిల్లలమర్రి జానకీరాములు, పద్మ దంపతుల కుమార్తె రాజ్యలక్ష్మి 2020లో అమెరికాలోని అమెజాన్‌లో ఉద్యోగం సాధించింది. అక్కడే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మ్యాథ్యూ మిక్లర్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే కావడంతో ఇరు కుటుంబాలను ఒప్పించి సత్తుపల్లిలో గతేడాది జూన్ 4వ తేదీన వివాహం చేసుకున్నారు. ఈ జంట ప్రస్తుతం అమెరికాలోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా ఆనందంగా జీవనం సాగిస్తున్నారు. ఒకరినొకరు అర్థం చేసుకుని పెద్దలను ఒప్పించగలిగితే ప్రాంతాలు అడ్డుగోడలుగా నిలవవని వారు చెబుతున్నారు.

ప్రేమ పలకరింపు.. పెళ్లి పయనం


స్రవంతి - రవికుమార్

సుజాతనగర్: మాట రాకపోతేనేమీ, కాళ్లు కదలకపోతేనేమీ వారి మనసులు కలవడంతో లోపాలు సమస్యగా మారలేదు. ఇరువురిలో లోపాలే వారి ప్రేమకు గట్టి పునాది వేయగా వివాహ బంధంతో ఒక్కటయ్యారు. సుజాతనగర్ మండలంలోని సీతంపేట బంజరకు చెందిన గుగులోత్ బిచ్చ, చంద్రి దంపతుల ఆఖరి సంతానం రవికుమార్‌కు ఐదేళ్ల వయసులో పోలియో సోకడంతో కాళ్లు పనిచేయవు. రాంజీతండా గ్రామానికి చెందిన లావుడ్యా శంకర్ నాయక్, సక్రి దంపతుల కుమార్తె స్రవంతి పుట్టుకతోనే బధిరురాలు. వీరిద్దరూ ప్రతినెల పింఛన్ తీసుకోవడానికి వచ్చిన సమయంలో పరస్పరం చూసుకొని ఇష్టపడ్డారు. ఆ తర్వాత ప్రేమగా మారడంతో పెద్దలకు చెప్పడంతో అంగీకరించగా వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఇప్పుడు మూడేళ్ల కుమారుడు ఉన్నాడు.

ఉద్యోగుల సర్టిఫికెట్ల డిజిటలైజేషన్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఉద్యోగులు, కార్మికులకు సంబంధించిన సర్టిఫికెట్లను డిజిటలైజేషన్ చేయనున్నామని సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్వీకే శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 16న కార్మికులు, ప్రజా సంఘాలు తలపెట్టిన సమ్మెతో సంస్థలో బొగ్గు ఉత్పత్తి స్తంభించకుండా ఉండేందుకు రెండు రోజుల నుంచి కార్మిక సంఘాల నుంచి చర్చలు జరుపుతున్నామన్నారు. సింగరేణి బొగ్గు అన్‌లోడింగ్ విషయంలో టిప్పర్ డ్రైవర్లు కొన్ని తప్పులు చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని, వాటిని అరికట్టేందుకు చర్యలు చేపడుతామని చెప్పారు. త్వరలో సింగరేణి డిపెండెంట్ల సమస్యలపై కమిటీ వేసి, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. వీకే–7 ఓసీకి సంబంధించిన అనుమతులు త్వరలో రానున్నాయని ఆయన వివరించారు.

మామపై అల్లుడి దాడి

పాల్వంచ: మామపై అల్లుడు దాడికి పాల్పడటంతో పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. నెహ్రూనగర్‌కు చెందిన కేటీపీఎస్ ఆర్టిజన్ రమావత్ నర్సింహా అల్లుడు బాదావత్ రాజేశ్ ఒడిశా రాష్ట్రంలో గ్రామీణ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే, అతను వేరే యువతితో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను సరిగా చూసుకోవడం లేదు. ఈ విషయంలో పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీ నిర్వహించి మందలించారు. దీనిని మనసులో పెట్టుకున్న రాజేశ్ ఈ నెల 11వ తేదీన పాల్వంచలో ఉండే అన్న జగన్‌ను తీసుకుని నర్సింహా ఇంటికి వచ్చి దాడి చేశారు. ఇంట్లోని గృహోపకరణాలు ధ్వంసం చేశారు. చుట్టుపక్కల వారు వచ్చేసరికి వారు అక్కడి నుంచి పారిపోయారు. ధ్వంసం చేసిన వస్తువుల విలువ రూ.12 వేలు ఉంటుందని, దాడి చేసిన ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం బాధితుడు ఫిర్యాదు చేయగా ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

మిషన్ భగీరథ నీటిలో 'అవుడు' జీవులు



నీటిలో వచ్చిన ఎర్రటి అవుడు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం పంచాయతీ ట్యాంకు నుంచి సరఫరా చేసే నీటిలో మంగళవారం ఎర్రటి నీటి అవుడు జీవులు రావడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. సురక్షితమైన నీరు అందిస్తున్నామని మిషన్ భగీరథ అధికారులు చెబు తున్నప్పటికీ అప్పుడప్పుడూ ఇలా నీటిలో ఇటువంటి జీవులు రావడం ఆందోళన కలిగించే అంశం. మిషన్ భగీరథ అధికారులు, పంచా యతీ అధికారులు వాటర్‌ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకో వాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదుకోండి..

అశ్వాపురం: ప్రాణాంతకవ్యాధితో బాధపడుతున్న చిన్నారిని ఆదుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. మండల కేంద్రంలోని తురుములగూడెం తండాకు చెందిన తేజావత్ శంకర్, లత దంపతుల కూతురు తేజావత్ హారిణి (9) గౌతమీనగర్ కాలనీలోని ఏఈసీఎస్‌లో రెండో తరగతి చదువుతోంది. చిన్నారి కొంతకాలంగా లింఫోబ్లాస్టిక్ లుకేమియా ప్రాణాంతక వ్యాధితో బాధపడుతోంది. ప్రస్తుతం చిన్నారి హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. రూ.లక్షలు ఆ చిన్నారి వైద్యానికి అవసరమవుతున్నాయి. నిరుపేద కుటుంబం కావడంతో తల్లిదండ్రులు డబ్బులకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఆర్థిక సాయం చేసి తన కూతురు వైద్య ఖర్చులకు చేయూత అందించాలని తల్లిదండ్రులు శంకర్, లత వేడుకుంటున్నారు. సాయం చేయాల్సిన వారు ఫోన్‌పే నంబర్ 97014 93448, గూగుల్ పే నంబర్ 96403 46057లను సంప్రదించాలని వారు కోరుతున్నారు.

'నారీ శక్తి వందన్'ను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న రంగాకిరణ్

చుంచుపల్లి: బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం కొత్తగూడెం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నారీ శక్తి వందన్ అభియాన్ వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు కె.వి.రంగాకిరణ్ హాజరై ప్రసంగించారు. మహిళా స్వయం సహాయక సంఘాలు, ఎన్జీవోల సభ్యులతో ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 23న వర్చువల్ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని ప్రతి మండలంలో పెద్ద సంఖ్యలో డ్వాక్రా గ్రూప్ మహిళలు వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అభియాన్ కోఆర్డినేటర్ చింతలచెర్వు శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాముల ఐలయ్య, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చిర్రా సరస్వతి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ముక్కెర కోటేశ్వరి, బిజ్జం శ్రీనివాస్‌రెడ్డి, కొమ్ము వంశీకుమార్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు బిట్రగుంట క్రాంతికుమార్, దోమల రమేశ్, సలీం, బాలరాజు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలపై బదిలీ ప్రభావం!

- కీసర ఆర్డీఓగా రామాలయ ఈఓ
- శ్రీరామనవమికి రెండు నెలలు ముందు ట్రాన్స్‌ఫర్
- రమాదేవినే కొనసాగించాలంటూ ఆలయ సిబ్బంది, స్థానికుల ఆందోళన


దేవస్థాన కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అర్చకులు, ఉద్యోగులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఏప్రిల్ 9 నుంచి 23 వరకు వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. వేడుకల్లో భాగంగా 17న సీతారాముల కల్యాణం, 18న మహా పట్టాభిషేకం ఉంటాయి. ఈ ఉత్సవాలకు రెండు నెలల సమయమే ఉండగా, ఇప్పుడు ఆలయ ఈఓ రమాదేవిని కీసర ఆర్డీఓగా బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. భద్రాచలంలో జరిగే శ్రీరామనవమి వేడుక ఎంతో కీలకమైంది. దేశ నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. ఈ క్రమంలో వారికి సౌకర్యాలు కల్పించడం, వీఐపీల ప్రొటోకాల్‌లో పొరపాట్లు లేకుండా చూడడం ఆలయ అధికారుల ప్రధాన విధి. ఈఓగా బాధ్యతలను స్వీకరించిన ఏడాదిలోనే శ్రీరామనవమి, ముక్కోటి ఉత్సవాలను విజయవంతం చేసిన రమాదేవిని ఈ సమయంలో బదిలీ చేయడం సరైంది కాదని, బ్రహ్మోత్సవాలపై ఈ ప్రభావం పడుతుందని స్థానికులు, సిబ్బంది, భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గాడిలో పడిన నిర్వహణ..

గతేడాది ఫిబ్రవరి 16న రమాదేవి ఈఓగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఐదు నెలల క్రితం పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది కాలంలో ఆలయ ఆదాయాన్ని గణనీయంగా పెంచడంతో పాటు భక్తులకు వసతుల కల్పనలో ఈఓ తనదైన ముద్ర వేశారు. దేవస్థాన వెబ్‌సైట్ రూపకల్పన, స్వామివారి ఆర్జిత సేవలు, ప్రసాదాలు, వసతి గదుల వివరాలను ఆన్‌లైన్ ద్వారా భక్తులకు అందుబాటులో ఉంచారు. ముక్కోటి, శ్రీరామనవమి టికెట్లను సైతం ఆన్‌లైన్‌లో ఉంచి భక్తుల కష్టాలు తీర్చడంతో పాటు ఆలయ ఆదాయం పెంచారు. స్వామివారి సుందర చిత్రాలతో కూడిన క్యాలెండర్‌ను ఎన్నో ఏళ్ల తర్వాత ఈ సంవత్సరం భక్తుల ముంగిటకు తీసుకొచ్చారు. 2022లో అన్ని విభాగాల్లో కలిపి ఆలయానికి సుమారు రూ.28 కోట్ల ఆదాయం రాగా, 2023లో రూ.42 కోట్లకు పెంచగలిగారు. ఆలయంలో వెండి వాకిలి ఏర్పాటు, పురుషోత్తపట్నంలో గోశాల నిర్మాణానికి దాతల సహకార సేకరణలో కీలక పాత్ర పోషించారు. ఏపీలోని పురుషోత్తపట్నంలో రామయ్య భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతుండగా ధైర్యంగా ఎదుర్కొని, ఆ స్థలాలో బైఠాయించి నిరసన తెలిపారు. దేవుడి భూములను అప్పగించాలంటూ ఏపీ మంత్రులను, ఉన్నతాధికారులను కలిసి సమస్య వివరించారు. దేవస్థానంలో అవినీతి, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన సిబ్బందిపై కఠినంగా వ్యవహరించి దారిలో పెట్టారు.

బదిలీపై నిరసనల వెల్లువ..

ఆలయ ఈఓ రమాదేవి బదిలీ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. పార్లమెంట్ ఎన్నికల్లో జరిగిన బదిలీ అని కొందరు అంటుండగా, కొందరు కాంట్రాక్టర్లు ఇతర జిల్లా మంత్రులతో ఉన్న సాన్నిహిత్యంతో బలవంతంగా బదిలీ చేయించారనే ప్రచారం నడుస్తోంది. కాగా, ఈఓగా రమాదేవినే కొనసాగించాలంటూ మంగళవారం పలు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఆలయ ఉద్యోగులు, అర్చకులతో పాటు పుర ప్రముఖులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధిలో ఈఓ కీలకపాత్ర పోషించారని, బదిలీని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. భద్రాచలం అంబేద్కర్ సెంటర్‌లో పుర ప్రముఖులు, దేవస్థాన కార్యాలయం వద్ద అర్చకులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సామాజిక మాధ్యమాల్లోనూ ఆమెకు మద్దతుగా పలువురు నిలవడం గమనార్హం.

నాణ్యమైన బొగ్గును అందించాలి

సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) వెంకటేశ్వరరెడ్డి

మణుగూరుటౌన్: యంత్ర సామగ్రిని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ పని గంటలను పెంచుకుంటూ ఏరియా నుంచి భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌తో పాటు ఇతర పరిశ్రమలకు నాణ్యమైన బొగ్గును అందించాలని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మణుగూరు ఏరియాలో పర్యటించిన ఆయన తొలుత కొండాపురం గనిని సందర్శించి కంటిన్యూస్ మైనర్ యంత్రం ద్వారా బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ గురించి సంబంధిత అధికారులతో, కాంట్రాక్ట్ కంపెనీ యాజమాన్యంతో మాట్లాడారు. ఓసీ–2, ఓసీ–4 మణుగూరు ఉపరితల గని వ్యూపాయింట్ నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గు ఉత్పత్తికి నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. 2024–25 వార్షిక లక్ష్య సాధనకు కూడా సంసిద్ధులై బొగ్గు ఉత్పత్తి రవాణాలో సరికొత్త రికార్డు సృష్టించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు వీసం కృష్ణయ్య, నర్సిరెడ్డి, లక్ష్మీపతిగౌడ్, వీరభద్రరావు, శ్రీనివాసాచారి, రాంబాబు, వీరభద్రుడు, రవీందర్, వెంకటేశ్వర్లు, రాజేశ్వరరావు, మధుబాబు, లింగబాబు, భాస్కర్ రావు, చిట్ల శ్రీనివాస్, షబ్బీరుద్దీన్ తదితరులు ఉన్నారు.

చోరీకి వచ్చి.. సామగ్రి ధ్వంసం

అన్నపురెడ్డిపల్లి: ఆలయంలో చోరీకి వచ్చి, హుండీల్లో నగదు లేకపోవడంతో సామగ్రిని ధ్వంసం చేసిన ఘటన అన్నపురెడ్డిపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి మండలంలోని జానకీపురం గ్రామ శివారులోని శ్రీసత్తెమ్మ తల్లి ఆలయం ముందు భాగంలోని గ్రిల్స్ తొలగించి, గుర్తుతెలియని దుండగులు లోపలికి ప్రవేశించారు. రెండు హుండీలను బద్దలు కొట్టగా వాటిల్లో నగదు లేకపోవడంతో సామగ్రి ధ్వంసం చేశారు. రెండు సీసీ కెమెరాలతో పాటు మానిటర్, ఆలయ సామగ్రి ఉంచే గది తలుపులు పగులగొట్టి వెళ్లారు. సుమారు రూ.25 వేలు ఆస్తినష్టం వాటిల్లిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కొత్తగూడెం క్లూస్‌టీం సభ్యులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, వేలిముద్రలు సేకరించారు. స్థానిక ఎస్ఐ షాహీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

11 టన్నుల గంజాయి దహనం


గంజాయిని దహనం చేస్తున్న పోలీస్ అధికారులు

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని 17 పోలీస్ స్టేషన్లలో 142 కేసుల్లో సీజ్ చేసిన 11,061 కేజీల నిషేధిత గంజాయిని లక్ష్మీదేవిపల్లి మండలంలోని హేమచంద్రపురం గ్రామ శివార్లలో జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు, డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు. గంజాయి విలువ రూ.27 కోట్లకుపైనే ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఓఎస్డీ సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ వెంకట్, మణుగూర్ డీఎస్పీ రాఘవేంద్రరావు దహన ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ.. అక్రమార్జనలో భాగంగా గంజాయిని విక్రయిస్తున్నారని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల యువతను ప్రలోభాలకు గురి చేస్తున్నారన్నారు. పోలీస్ శాఖలో రహస్య బృందాలను ఏర్పాటు చేశామని, ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఓఎస్డీ సాయిమనోహర్, ఏఎస్పీ పరితోష్‌పంకజ్, డీఎస్పీలు వెంకటేశ్, రాఘవేంద్రరరావు, డీఎస్పీ మల్లయ్య, స్వామి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యాష్ ట్యాంకర్ బోల్తా

పినపాక: యాష్ ట్యాంకర్ బోల్తా పడి డ్రైవర్‌కు స్వల్ప గాయాలైన ఘటన మండలంలోని మల్లారం గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. బీటీపీఎస్ నుంచి యాష్ లోడ్ చేసుకొని తాండూరు వెళ్తుండగా మల్లారం మూలమలుపు వద్ద అదుపుతప్పి ఒక్కసారిగా లారీ బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలు కాగా 108 వాహనంలో పినపాక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ శివప్రసాద్, ఎస్ఐ వెంకటప్పయ్య వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అదుపుతప్పి టిప్పర్ బోల్తా..

దుమ్ముగూడెం: మండలంలోని నడికుడి శ్రీ మహంకాళి చాముండేశ్వరి ఆలయ సమీపంలో మంగళవారం ఉదయం టిప్పర్ అదుపుతప్పి బోల్తాపడింది. భద్రాచలం నుంచి లక్ష్మీనగరం వైపు వెట్ మిక్సర్‌తో వస్తున్న టిప్పర్ ఉదయం మంచు కారణంగా టిప్పర్ డ్రైవర్‌కు రహదారి స్పష్టంగా కనిపించకపోవడంతో అదుపుతప్పి 33 కేవీ విద్యుత్ స్తంభంపై పడటంతో అది విరిగింది. డ్రైవర్‌కు ఏమీ కాలేదు. ఎదురుగా ఏ వాహనం కూడా రాకపోవడం, అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

మొసళ్లున్నాయి.. వాగులోకి వెళ్లొద్దు

- రైతులకు అటవీ అధికారుల సూచన


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గుండాల: మండలంలోని రోళ్లగడ్డ సమీపంలో గల మల్లన్నవాగులో మొసళ్లు సంచరిస్తున్నాయని, అటువైపు ఎవరూ వెళ్లొద్దని అటవీశాఖ గుండాల రేంజర్ జశ్వంత్ రైతులకు సూచించారు. వాగులో మొసళ్లు సంచరిస్తున్నాయనే సమాచారం మేరకు మంగళవారం ఆయన చుట్టుపక్క గ్రామాల గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బట్టలు ఉతికేందుకు, ఈతకు వాగుకు వెళ్లొద్దని చెప్పారు. పశువులను సైతం నీళ్లకోసం అటువైపు తీసుకెళ్లరాదని తెలిపారు. ముఖ్యంగా చేపలవేట చేయొద్దని, విద్యుత్ తీగలు అమర్చొద్దన్నారు. ప్రస్తుతం వాగు ఎక్కువ లోతు ఉన్నందున నీళ్లు తగ్గేవరకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఆర్ఓ బాలాజీ, సిబ్బంది కోటేశ్వరరావు, చంద్రయ్య, రవి ఉన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడి మోటార్ సైకిళ్లు, వెండి నగలు కాజేసిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పట్టణంలోని ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో భద్రాచలానికి చెందిన షేక్ దారుక్ బాబా అలియాస్ చోటు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించగా అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ సందర్భంగా రెండు మోటార్ సైకిళ్లు, 30 తులాల వెండి పట్టీలు, ఒక గ్రామ్ బంగారు ఉంగరం చోరీ చేసినట్లు అంగీకరించగా సొత్తు స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

ఎల్లో మీడియా చానల్స్‌ను ప్రతివాదులుగా చేర్చిన హైకోర్టు

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో టీడీపీ అధినేత చంద్రబాబుకు రిమాండ్ విధించడంతోపాటు కేసు కొట్టేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చుతూ తీర్పునిచ్చినందుకు ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులతోపాటు ఏసీబీ కోర్టు జడ్జిని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో అసభ్య పోస్టింగ్‌లు, కామెంట్లు పెట్టడంపై దాఖలైన క్రిమినల్ కోర్టు ధిక్కార వ్యాజ్యంలో ఎల్లో మీడియా చానల్స్ టీవీ 5, మహాన్యూస్, మైరా మీడియా సంస్థలను హైకోర్టు ప్రతివాదులుగా చేర్చింది. హైకోర్టు న్యాయమూర్తులు, ఏసీబీ కోర్టు న్యాయాధికారిపై యూట్యూబ్‌లో ఉంచిన అసభ్యకర, అభ్యంతరకర పోస్టులను తొలగించాలని గూగుల్ ఎల్ఎల్‌సీని ఆదేశించింది. కాగా.. తమ మాధ్యమాల్లో ఉంచిన అసభ్యకర, అభ్యంతరకర పోస్టులను ఇప్పటికే తొలగించామని ప్రముఖ ఆన్‌లైన్ సామాజిక మాధ్యమ సంస్థలైన ఎక్స్, ఫేస్‌బుక్ హైకోర్టుకు నివేదించాయి. ఈ వివరాలను హైకోర్టు రికార్డ్ చేసింది. ఈ కోర్టు ధిక్కార వ్యాజ్యంలో పలువురికి ఇంకా నోటీసులు అందచేయాల్సి ఉందని, అందువల్ల నోటీసులు అందజేసేందుకు మరికొంత గడువు ఇవ్వాలని అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ హైకోర్టును అభ్యర్థించారు. ఇందుకు అంగీకరించిన హైకోర్టు తదుపరి విచారణను మార్చి 26కి వాయిదా వేసింది.

అటు ఆటలు ఇటు ఆరోగ్యం

- మట్టిలో మాణిక్యాల్ని వెలికితీద్దాం
- జాతీయ, అంతర్జాతీయ వేదికలకు పరిచయం చేద్దాం

''మన ఊరిలో.. మన వార్డులో మట్టిలో మాణిక్యాలు ఎందరో ఉన్నారు. వారందరినీ గుర్తించి సాన పట్టగలిగితే జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేయవచ్చు. అలాంటి వారిని గుర్తించేందుకే 'ఆడుదాం ఆంధ్రా..' అనే బృహత్తర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది'' – సీఎం జగన్

ఇకపై ఏటా 'ఆడుదాం ఆంధ్ర': సీఎం జగన్



మహిళా క్రికెట్ విభాగంలో విజేతగా నిలిచిన ఎన్టీఆర్ జిల్లా సిద్దార్థ నగర్ సచివాలయ జట్టుకు రూ.5 లక్షల చెక్కు, కప్‌ను అందించిన సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: సచివాలయ స్థాయి నుంచి ఆరోగ్యంపై శ్రద్ధ, ఆటలపై మక్కువ పెంచేందుకు 'ఆడుదాం ఆంధ్రా..' కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 25.45 లక్షల మంది క్రీడాకారులు ఇందులో పాలుపంచుకున్నారని, ఈ కార్యక్రమాన్ని ఏటా ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. 47 రోజుల పాటు ఉత్సాహభరితంగా నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా' ముగింపు ఉత్సవాలు మంగళవారం విశాఖలోని డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఘనంగా జరిగాయి. ముఖ్యమంత్రి జగన్ ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఆరోగ్యం, వ్యాయామంపై అవగాహన పెంచేలా..

మన ఆరోగ్యానికి వ్యాయామం, క్రీడలు ఎంత అవసరం అనే అంశంపై రాష్ట్రంలోని ప్రతి ఇంటిలో, ప్రతి గ్రామంలో అవగాహన పెరగాలి. ఆడుదాం ఆంధ్రా ద్వారా ఆరోగ్యం, వ్యాయామం పట్ల అవగాహన పెరగాలన్నది ఒక ఉద్దేశమైతే గ్రామ స్థాయి నుంచి మట్టిలోని మాణిక్యాల్ని గుర్తించి వారి ప్రతిభకు సాన పెట్టి శిక్షణ ఇవ్వడం మరో లక్ష్యం. తద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన యువత రాణించేలా ప్రోత్సహించవచ్చు.

తమ్ముళ్లు, చెల్లెమ్మలకు ఆల్ ది బెస్ట్..

క్రికెట్‌లో ఇద్దరు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెమ్మలను టాలెంటెడ్ ప్లేయర్స్‌గా గుర్తించాం. కబడ్డీలో ముగ్గురు తమ్ముళ్లు, ఒక చెల్లెమ్మను గుర్తించాం. వాలీబాల్‌లో ఒక తమ్ముడు, ఒక చెల్లెమ్మ ప్రతిభను చాటుకున్నారు. ఖోఖోలో ఒక తమ్ముడు, చెల్లెమ్మ ప్రతిభను గుర్తించాం. బ్యాడ్మింటన్‌లో ఒక తమ్ముడు, చెల్లెమ్మ ప్రతిభ నిరూపించుకున్నారు. వారికి సరైన శిక్షణ ఇవ్వగలిగితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో ప్రోత్సహిస్తూ అడుగులు వేస్తున్నాం. ఎంపికైన తమ్ముళ్లు, చెల్లెమ్మలకు ఆల్ ద బెస్ట్.

రిలయన్స్, బిర్లా భారీ పెట్టుబడులు

- నేడు వర్చువల్‌గా సీఎం జగన్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రూ.1,700 కోట్లతో ఆదిత్య బిర్లా కార్బన్ బ్లాక్ మాన్యుఫ్యాక్చర్ ఫెసిలిటీ
- రూ.1,024 కోట్లతో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్లు
- పలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభం
- మొత్తం 10 కంపెనీలు.. రూ.4,883 కోట్ల పెట్టుబడులు
- 4,046 మందికి ఉద్యోగాలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగ అభివృద్ధిలో మరో కీలక ఘట్టానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు శ్రీకారం చుడుతున్నారు. రిలయన్స్ బయో ఎనర్జీ, ఆదిత్య బిర్లా గ్రూప్‌తోపాటు పలు సంస్థలు రాష్ట్రంలో నెలకొల్పుతున్న పరిశ్రమలకు ముఖ్యమంత్రి జగన్ బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ.4,178 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటవుతున్న పలు పరిశ్రమలకు భూమి పూజ నిర్వహించనున్నారు. ఇవి కాకుండా రూ.655 కోట్లతో నెలకొల్పిన ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్లను ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించనున్నారు. మొత్తంగా సుమారు రూ.4,833 కోట్ల పెట్టుబడులు రానుండగా కొత్తగా 4,046 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.

తొలుత 8 చోట్ల రిలయన్స్ ప్లాంట్లు

రిలయన్స్ బయో ఎనర్జీ రాష్ట్రంలో 8 ప్రాంతాల్లో వ్యవసాయ వ్యర్థాల నుంచి బయో గ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. మొత్తం రూ.1,024 కోట్ల పెట్టుబడితో తొలి దశలో కాకినాడ, రాజమండ్రి, విజయవాడ, కర్నూలు, నెల్లూరులో బయో గ్యాస్ ప్లాంట్లను నెలకొల్పనుంది. తద్వారా 576 మందికి ఉద్యోగావ అవకాశాలు లభించనున్నాయి. ఆదిత్య బిర్లా గ్రూప్ రూ.1,700 కోట్ల పెట్టుబడితో తిరుపతి జిల్లా నాయుడుపేటలో మాన్యుఫ్యాక్చరింగ్ ఆఫ్ కార్బన్ బ్లాక్‌ను ఏర్పాటు చేయనుంది. దీనిద్వారా 250 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. వీటితో పాటు హెల్లా ఇన్‌ఫ్రా, వెసువియస్ ఇండియా లిమిటెడ్, ఏపీఐఐసీ, ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్, అన ఒలియో ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన పలు ప్రాజెక్టులకు సీఎం జగన్ వర్చువల్‌గా శంకుస్థాపనలతో పాటు పలు యూనిట్లను ప్రారంభిస్తారు.

ఓటర్ల జాబితాలపై 'సుప్రీం' సంతృప్తి

- ఎన్నికల సంఘం చర్యలు భేష్ అన్న సీజే నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం
- తాజా ఆదేశాలతో ఎల్లో మీడియా తుప్పు వదిల్చిన సుప్రీం కోర్టు

సాక్షి, అమరావతి: ఓటర్ల జాబితాల తయారీ విషయంలో ఎన్నికల అధికారులపై నిత్యం అడ్డగోలు ఆరోపణలు చేస్తూ నానా యాగీ చేస్తున్న ఎల్లో మీడియా నోళ్లు మూయిస్తూ సుప్రీం కోర్టు కీలక ఉత్తర్వులు వెలువరించింది. ఓటర్ల జాబితాల విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) తీసుకుంటున్న చర్యలపై సుప్రీంకోర్టు పూర్తి సంతృప్తి వ్యక్తం చేసింది. ఎన్నికల సంఘం చర్యలు సంతృప్తికరంగా ఉన్నందున ఈ వ్యవహారంలో తదుపరి తమ నుంచి ఎలాంటి ఆదేశాలు అవసరం లేదని తేల్చి చెప్పింది. ఒక చిరునామా నుంచి మరో చిరునామాకు మారిన ఓటర్లు లేదా మరణించిన ఓటర్లు లేదా డూప్లికేట్‌గా నమోదైన ఓటర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించే విషయంలో చట్ట నిబంధనల మేరకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర ఎన్నికల సంఘం లిఖితపూర్వకంగా సమర్పించిన వివరాలు సంతృప్తికరంగా ఉన్నాయని స్పష్టం చేసింది. ఓటర్ల నమోదు ప్రక్రియ మొదలు, ఓటర్ల జాబితా సవరణ, తుది ఓటర్ల జాబితా తయారీ వరకు మొత్తం ప్రక్రియను అత్యంత పారదర్శకతతో చేపడుతున్నామన్న సీఈసీ వాదనతో సుప్రీం కోర్టు ఏకీభవించింది. ఓటర్ల జాబితా నుంచి తొలగించే ముందు చట్ట ప్రకారం వారికి నోటీసు ఇచ్చి వారి వివరణ తీసుకున్న తరువాతే తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కూడా ఎన్నికల సంఘం చెప్పిన అంశాన్ని సుప్రీం కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఎన్నికల సంఘం పారదర్శకంగా అన్ని చర్యలు తీసుకుంటున్నప్పుడు ఇక తదుపరి ఆదేశాలతో పనేముందని విచారణ సందర్భంగా పిటిషనర్‌ను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. పిటిషనర్ సందేహాలను ఎన్నికల కమిషన్ నివృత్తి చేసిందని సుప్రీం కోర్టు గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో తమ ముందున్న వ్యాజ్యంతో తదుపరి విచారణ అవసరం లేదంది. ఓటర్ల జాబితా విషయంలో అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులను ప్రతివాదులుగా చేర్చడంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యలను ప్రశ్నిస్తూ 'సన్నద్ బాచావో ట్రస్ట్' దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సుప్రీం కోర్టు పరిష్కరించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధనుంజయ్ చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జంషేడ్ బుర్జోర్ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన విస్తృత ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎల్లో మీడియా నిత్య రాద్ధాంతం

రాష్ట్రంలో ఓటర్ల జాబితాల విషయంలో పెద్దఎత్తున అక్రమాలు జరిగిపోతున్నాయని, టీడీపీ అధినేత చంద్రబాబు సహా ఇతర నేతలు చేసిన ఫిర్యాదులను కేంద్ర ఎన్నికల సంఘం పట్టించుకోవడం లేదంటూ ప్రతిరోజూ ఎల్లో మీడియా పుంఖానుపుంఖాలుగా కథనాలు వండివారుస్తోంది. రాష్ట్రంలో ఏదో జరిగిపోతోందన్న ఆందోళనను ప్రజల్లో కలిగించేందుకు సర్వశక్తులు ఒడ్డుతోంది. కొంతకాలంగా ఎన్నికల అధికారులను లక్ష్యంగా చేసుకుని అసత్యాలను ప్రచారం చేస్తోంది. ఎన్నికల అధికారులపై నిరాధార ఆరోపణలు చేయడానికి కూడా ఏ మాత్రం వెనుకాడటం లేదు. ఓటర్ల జాబితాల తయారీ విషయంలో ఎన్నికల అధికారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారంటూ నిరాధార ఆరోపణలు చేస్తోంది. రాష్ట్రంలో ఓటర్ల జాబితా తయారీలో స్వచ్ఛత లేదని నమ్మించే ప్రయత్నం చేస్తోంది. అడ్డగోలుగా ఓటర్ల జాబితా నుంచి తొలగింపులు చేస్తున్నారంటూ ఆరోపణలు గుప్పిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో సుప్రీం కోర్టు ఇచ్చిన తాజా ఉత్తర్వులు ఎల్లో మీడియాకు గట్టిగానే షాకిచ్చేవిగా ఉన్నాయి.

సన్నద్ బచావో ట్రస్ట్ పిటిషన్‌పై విచారణ

రాజ్యాంగంలోని అధికరణ 324 ప్రకారం సవరణ ఓటర్ల జాబితాలను తయారు చేసేలా ప్రధాన ఎన్నికల అధికారులను ఆదేశించాలని, అలాగే చిరునామా మారిన, మరణించిన, డూప్లికేట్‌గా నమోదైన ఓటర్ల విషయంలో ప్రజాప్రాతినిధ్య చట్ట నిబంధనల ప్రకారం వ్యవహరించేలా కూడా ఆదేశాలు ఇవ్వాలంటూ సన్నద్ బాచావో ట్రస్ట్ 2023లో సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై సీజే నేతృత్వంలోని విస్తృత ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ఆరోరా వాదనలు వినిపిస్తూ.. డూప్లికేట్ ఓటర్ల విషయంలో ఎన్నికల అధికారులు సరిగ్గా స్పందించడం లేదన్నారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది అమిత్ శర్మ స్పందిస్తూ.. డూప్లికేట్ ఓటర్లతో సహా ఓటర్ల జాబితా విషయంలో తాము తీసుకుంటున్న అన్ని చర్యలనూ వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేస్తామని చెప్పారు. ఇందుకు ధర్మాసనం అనుమతి ఇచ్చింది.

'చట్టానికి లోబడే చేస్తున్నాం'

ఈ నేపథ్యంలో అమిత్ శర్మ కేంద్ర ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ సమగ్ర కౌంటర్ దాఖలు చేశారు. అలాగే ఓ నోట్ కూడా ధర్మాసనం ముందుంచారు. సోమవారం ఈ వ్యాజ్యం విచారణకు వచ్చినప్పుడు సుప్రీం కోర్టు ధర్మాసనం ఆ నోట్‌ను క్షుణ్ణంగా పరిశీలించింది. చిరునామాలు మారడం, మరణించడం, భౌగోళికంగా ఓకే ప్రాంతంలో ఓటర్లుగా నమోదు కావడం వంటి విషయాల్లో తీసుకుంటున్న చర్యలను ఎన్నికల సంఘం తన కౌంటర్‌లో వివరించింది. చట్టానికి లోబడి తాము చేస్తున్న పనులన్నింటినీ కోర్టుకు తెలియచేసింది. ఓటర్ల జాబితా నుంచి ఎవరి పేరైనా తొలగించదలచుకుంటే వారికి నోటీసులు ఇచ్చి, అభ్యంతరాలు స్వీకరించి ఆ తరువాత మాత్రమే తదుపరి చర్యలు తీసుకుంటున్న విషయాన్ని సవివరంగా అత్యున్నత న్యాయస్థానానికి నివేదించింది. ప్రతి దశలో ఏం చేస్తున్నాయో తెలియజేసింది. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తున్న విషయాన్ని కూడా చెప్పింది. లోపాలన్నింటినీ సవరించిన తరువాతే తుది జాబితాను ప్రకటిస్తున్నామని స్పష్టం చేసింది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఉన్నత విద్యలో మరో చరిత్ర

ఎడెక్స్ ద్వారా అంతర్జాతీయ వర్సిటీల సర్టిఫికేషన్ కోర్సులు

సాక్షి, అమరావతి: విద్యా రంగ సంస్కరణలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా మరో కీలక అడుగు వేసింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, హార్వర్డ్, ఎంఐటీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి లాంటి అత్యుత్తమ వర్సిటీలు అందించే కోర్సులను విదేశాలకు వెళ్లి చదువుకోలేని పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచితంగా వీటిని అందుబాటులోకి తెస్తోంది. ఈమేరకు ఇప్పటికే ప్రఖ్యాత మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సుల సంస్థ 'ఎడెక్స్'తో ఒప్పందం చేసుకుంది. పాఠ్యప్రణాళిక కోర్సుల్లో విద్యార్థి తనకు నచ్చిన వర్టికల్‌ను చదువుకునే అవకాశం కల్పిస్తోంది. ఈ నెల 16వ తేదీ నుంచి వర్సిటీల్లో ఎడెక్స్ కోర్సులను సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభించేలా కసరత్తు జరుగుతోంది.ఎడెక్స్ ప్రపంచంలోనే ప్రముఖ ఈ–లెర్నింగ్ ప్లాట్ ఫారమ్‌గా పేరొందింది. ఒక్కో కోర్సు చేయాలంటే సుమారు రూ.30 వేలు ఖర్చు అవుతుంది. ఇంత ఖరీదైన కోర్సులను రాష్ట్ర ప్రభుత్వం 12 లక్షల మందికిపైగా విద్యార్థులు, టీచర్లకు ఉచితంగా అందిస్తోంది.

జిల్లా వార్తలు

పోటీతత్వాన్ని పెంపొందించే ప్రతిభా పరీక్షలు


ప్రశ్నాపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈఓ, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థులలో ప్రతిభను వెలికితీయడమే కాక పోటీతత్వాన్ని పెంపొందించేందుకు ప్రతిభా పరీక్షలు దోహదపడతాయని ఖమ్మం డీఈఓ సోమశేఖరశర్మ, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. ఖమ్మంలోని విన్‌ఫీల్డ్ పాఠశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం టాలెంట్ టెస్ట్ నిర్వహించగా వారు ప్రశ్నాపత్రాలను ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాంతారావుతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు శివరామకృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.లక్ష్మణ్, ఇటికాల రామకృష్ణ, విన్‌ఫీల్డ్ యాజమాన్యం శ్రీకాంత్, కిషోర్, పుల్లారావుతో పాటు నాగుల్‌మీరా, నిఖిల్, సాయి, మురళి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్: రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి పురుషులు, మహిళల హ్యాండ్‌బాల్ జట్లను మంగళవారం ఎంపిక చేశారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన ఎంపిక పోటీలకు 80 మంది క్రీడాకారులు హాజరయ్యారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.రఘునందన్ తెలిపారు. ఈ మేరకు జిల్లా పురుషుల జట్టుకు ఎం.రాంబాబు, ఎం.మహేశ్, ఎస్.అశోక్, బి.సాయి, సీహెచ్ గణేశ్, పి.అజయ్‌కుమార్, బి.నగేశ్, డి.బలరామకృష్ణ, జి.కరుణాకర్, సీహెచ్ ఉపేంద్ర, డి.రవికిరణ్, పి.సాయితేజ, కె.ధర్మభిక్షం, ఆకాశ్, పి.రామారావు, టి.సురేశ్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. అలాగే, మహిళల జట్టుకు ఎల్.లావణ్య, జి.శాంతిప్రియ, ఎస్.నందిని, ఆర్.దివ్య, ఎ.కృష్ణవేణి, కె.లావణ్య, బి.రామేలు, జి.రమాదేవి, ఎం.అనూష, ఎ.అశ్విని, ఈ.శివాని, కె.త్రిపుర, ఆర్.శ్రీవాణి ఎంపికయ్యారని తెలిపారు.

దరఖాస్తులు పరిష్కరించాలి

ఖమ్మం సహకారనగర్: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు గాను ఓటర్ల నుంచి అందిన దరఖాస్తుల పరిష్కారం వేగంగా పూర్తిచేయాలని ఖమ్మం అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ సూచించారు. జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్లతో ఆయన మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఓటరు నమోదు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ పరిష్కరించాలని తెలిపారు. అలాగే, రెవెన్యూ సంబంధిత అంశాలపై ఆయన సూచనలు చేశారు.

అన్నదాతలకు మిత్రులు !



మిర్చి కోత పనుల్లో వలస కూలీలు (ఇన్‌సెట్) కూసుమంచి సమీపంలో ఏర్పాటు చేసుకున్న గుడారాలు

వలస కూలీల అడ్డాగా ఖమ్మం

- మిర్చి సీజన్‌లో ఛత్తీస్‌గఢ్ మధ్యప్రదేశ్ నుంచి రాక
- ఇతర రాష్ట్రాల కూలీల వైపే రైతుల మొగ్గు
- మూడు నుంచి నాలుగు నెలల పాటు జిల్లాలో ఉపాధి

కామేపల్లి/కూసుమంచి: తెలంగాణ రాష్ట్రంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మిర్చి విస్తారంగా సాగవుతోంది. అయితే, ఒకేసారి పంటకు కోత వస్తుండడంతో స్థానికంగా కూలీల లభ్యత లేక రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. స్థానికంగా కూలీలు సరిపడా లేకపోవడంతో మిర్చి కోసే వీలు లేక ఎదురుచూడాల్సి వస్తోంది. ఈనేపథ్యాన మేమున్నాం.. అంటూ మహారాష్ట్ర, ఒడిషా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల కూలీలు ఇక్కడి రైతులకు అండగా నిలుస్తున్నారు. ఏటా మిర్చి సీజన్‌లో కుటుంబాలతో సహా ఖమ్మం వస్తున్న కూలీలు ఉమ్మడి జిల్లా అంతటా మిర్చి ఏరడంలో నిమగ్నమవుతూ మూడు నుంచి నాలుగు నెలలు ఉపాధి పొందుతున్నారు.

వందల మైళ్లు ప్రయాణించి...

ఖమ్మం జిల్లాలోని కామేపల్లి, రఘునాథపాలెం, తిరుమలాపాలెం, మధిర, తల్లాడ, కారేపల్లి, ఏన్కూర్, కొణిజర్ల, తల్లాడ, పాలేరు, కూసుమంచి మండలాలతో పాటు భద్రాద్రి జిల్లాలోని చంద్రుగొండ, కరకగూడెం, సుజాతనగర్, జూలూరుపాడు, అశ్వారావుపేట, దమ్మపేట, చర్ల, దుమ్ముగూడెం తదితర మండలాలకు ఏటా మిర్చి సీజన్‌లో వలస కూలీలు రావడం ఆనవాయితీగా మారింది. ఇందులో ఒకసారి వచ్చిన వారు ఆతర్వాత ప్రతీఏటా వస్తుంటారు. ఇందులో కొన్ని జట్లకు రైతులే సమాచారం ఇచ్చి పిలిపించుకుంటారు. అలా వచ్చిన కూలీలకు మిర్చి తోటల వద్దే నివాసం ఏర్పాటు చేసుకుని పగలంతా మిర్చి తోటల్లో పని చేస్తారు. తెల్లవారుతుండగానే పని ప్రారంభించే సాయంత్రం పొద్దుపోయే వరకు మిర్చి ఏరడంలో నిమగ్నమవుతారు. తద్వారా త్వరత్వరగా కోతలు పూర్తవుతాయి. అలా ఒకగ్రామం నుంచి ఇంకో గ్రామానికి వెళ్తూ మూడు నుంచి నాలుగు నెలలు ఇక్కడే గడుపుతారు. గతంలో రైలు ద్వారా స్వస్థలాల నుంచి ఖమ్మం జిల్లాకు చేరుకునే వారు. కానీ కరోనా తర్వాత రైళ్ల రాకపోకల్లో ఆటంకం ఏర్పడడంతో ఆటో ట్రాలీల ద్వారా వస్తున్నారు. కాగా, రాకపోకల్లో వచ్చేందుకు ఖర్చు రైతులు, వెళ్లే ఖర్చు కూలీలు భరిస్తారు.

మంచి అనుబంధం

ఏటా మిర్చి కోతలకు వచ్చే వలస కూలీలు, రైతులకు మంచి అనుబంధం ఏర్పడుతోంది. కూలీలకు రైతులు అన్ని సౌకర్యాలను కల్పిస్తూ అండగా నిలుస్తారు. తద్వారా వలస కూలీలకు ఇక్కడి రైతులపై నమ్మకం పెరిగా ఏటా రావడం, తమను ఆదరించిన గ్రామానికే మొదట చేరుకోవడం ఆనవాయితీగా మారింది. ఇంకొందరు మాత్రం దళారుల చేయూతతో వస్తుండగా, రైతులు చెల్లించే కూలీలో కొంత వారు మినహాయించుకుంటున్నారు.

కిలోల చొప్పున కూలీ

గ్రామాల్లోని స్థానిక కూలీలు రోజువారి కూలీ తీసుకుని ఇతర రాష్ట్రాల కూలీలు మాత్రం కిలో చొప్పున డబ్బు తీసుకుంటున్నారు. కిలోకు రూ.15 నుండి రూ.20 తీసుకుంటారు. ప్రతిరోజు ఒక్కొక్కరు 25 కిలోల నుండి 50 కిలోల వరకు మిర్చి కోస్తారు. దీంతో సగటున రూ.500 నుండి రూ.750 సంపాదిస్తున్నారు. పనుల్లో ఆడమగ, పిల్లలు అనే తేడా లేకుండా పాల్గొంటున్నారు.

ఉపాధికి ఢోకా లేదు..


ఈ ప్రాంతంలో మాకు ఉపాధికి ఢోకా లేదు. సుమారు మూడు నెలలు చేతి నిండా పని దొరుకుతుంది. మిర్చి కోత కోసేందుకు వచ్చి పని పూర్తయ్యాక తిరిగి మా గ్రామానికి వెళ్తాం. ఏటా ఈ ప్రాంతానికి వస్తున్న మమ్మల్ని ఇక్కడి రైతులు మంచిగా చూసుకుంటారు. – బామన్, ఛత్తీస్‌గఢ్

సౌకర్యాలు కల్పిస్తారు..


మిర్చి కోతలు కోసేందుకు వచ్చిన మాకు రైతులు ఇక్కడ నివాసం ఉండేందుకు సౌకర్యాలు కల్పిస్తారు. మాకు డబ్బు చెల్లించడమే కాక ఇతరత్రా ఇబ్బంది ఉన్నా రైతులే దగ్గరుండి చూసుకుంటారు. దీంతో ఇంత దూరం వచ్చినా మాకు గ్రామంలో ఉన్నట్లే ఉంటుంది. – రాంబత్తి, ఛత్తీస్‌గఢ్

పొట్టకూటి కోసం వస్తాం...


మాకు మా ఊరిలో మొక్కజొన్న, గోధుమలే ఎక్కువగా పండుతాయి. మాకు మిర్చి తోటలు లేవు. ఇక్కడ మిర్చి కోయడం నేర్చుకుంటున్నాం. రెండు, మూడేళ్లుగా వస్తుండడంతో ఈ పని చేయటం అలవాటైంది. ఇక్కడి రైతులు మమ్ముల్ని మంచిగానే ఆదరిస్తున్నారు. – గులాబ్‌సింగ్, మధ్యప్రదేశ్

ఏటా వస్తుంటాం..


ప్రతీ సంవత్సరం కుటుంబ సమేతంగా మిర్చి కోత సమయాన వస్తుంటాం.మిర్చి కోతలు పూర్తయ్యే వరకు మూడు నుంచి నాలుగు నెలలు ఇక్కడే ఉంటాం. ఇక్కడి రైతులతో మేం కుటంబంలా మారిపోయాము. రైతులకు నమ్మకం కలగడంతో మమ్ముల్ని ఆదరిస్తున్నారు. – కమ్లుమండవీ, ఛత్తీస్‌గఢ్

వలస కూలీలతోనే కోత


ఏటా మిర్చి వలస కూలీలతోనే కోత కోయిస్తా. తద్వారా శ్రమ, ఖర్చు కూడా ఆదా అవుతుంది. సీజన్‌లో ఇక్కడ కూలీల కొరత ఉండడంతో వలస కూలీలను ఆశ్రయిస్తాం. వారు ప్రతీ సంవత్సరం వస్తుండడంతో కూలీలు, మాకు మంచి అనుబంధం ఏర్పడుతుంది. – లకావత్ రాములు, రైతు, కామేపల్లి మండలం

రోజుకు 25 కిలోలు కోస్తున్నా..


నేను, మా కుటుంబ సభ్యులు మిర్చి తోటలు కోసేందుకు వచ్చాం. నేను రోజుకు 25 కిలోల వరకు మిర్చి కోస్తున్నా. మాకు ఇక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా మూడు నెలలకు పైగానే పని దొరుకుతోంది. మేం వచ్చి రెండు నెలలు దాటగా మరో నెల ఇక్కడే ఉంటాం. – ధర్మీబాయి, మధ్యప్రదేశ్

మాస్టర్స్ టీ.టీ. పోటీల్లో పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్/కొత్తగూడెం టౌన్: గోవాలో జరిగిన జాతీయస్థాయి మాస్టర్స్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఖమ్మం జిల్లాకు చెందిన యాకూబ్‌అలీ, కొత్తగూడెంకు చెందిన ఈ.లోకేశ్ రజిత, కాంస్య పతకాలు గెలుచుకున్నారు. 30 ఏళ్లకు పైబడిన వారు పాల్గొన్న ఈ పోటీలు ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు జరగగా, వారు విజయం సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఖమ్మం డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్, ఓలేటి సాంబమూర్తితో పాటు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, డాక్టర్ శశికుమార్, రవిమారుత్, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, థామస్, ఎం.వీ.రమణ, చందు, రియాజ్, షామంత్, ఇమ్మానియేల్, ఫణి, రాంబాబు, వర్ధన్‌రావు తదితరులు అభినందించారు.

కేటీపీఎస్‌ను సందర్శించిన జెన్‌కో డైరెక్టర్


కర్మాగారంలో పరిశీలిస్తున్న డైరెక్టర్, అధికారులు

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ 7వ దశ కర్మాగారాన్ని టీఎస్ జెన్‌కో డైరెక్టర్ (థర్మల్) మంగళవారం బి.లక్ష్మయ్య సందర్శించారు. ఈ సందర్భంగా కోల్ ప్లాంట్, వ్యాగన్ టిప్లర్, స్విచ్‌యార్డ్, కంట్రోల్ రూం తదితర విభాగాలను పరిశీలించి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. సింగరేణి నుంచి నాణ్యమైన బొగ్గు వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ మేరకు ఇంజనీర్లు, కార్మికులు అవాంతరాలు లేని విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికాయుతంగా పనిచేయాలని సూచించారు. సీఈ పి.వెంకటేశ్వరరావు, ఎస్ఈలు గుర్రం రాజ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు, అధికారులు ఎస్ఎస్ శేఖర్, బి.హరిలాల్, సీహెచ్ శ్రీనివాసరావు, కె.రాంబాబు, వై.వెంకటేశ్వర్లు, బి.రవి, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కళ్ల ముందే కొడుకు రూపం

ఇంటి ఎదుట విగ్రహం ఏర్పాటుచేసిన తల్లిదండ్రులు

వైరారూరల్: చేతికొచ్చిన కొడుకు రోడ్డుప్రమాదంలో మృతి చెందాడు. ఆయన జ్ఞాపకాలు మరువలేని తల్లిదండ్రులు భౌతికంగా కాకపోయినా రూపంలోనైనా తమ కళ్లెదుట కుమారుడు ఉండాలని భావించారు. అందుకే రూ.3లక్షలు వెచ్చించి కుమారుడి విగ్రహాన్ని చేయించి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆవిష్కరించుకున్నారు. ఖమ్మం జిల్లా వైరా మండలం ముసలిమడుగులో కూలీ పనులు చేసుకునే తడికమళ్ల నాగార్జున, రంజాన్ దంపతుల కుమారుడు వంశీ(23) ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆయన జ్ఞాపకాలతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు కుమారుడి రూపం ఎన్నటికీ కళ్ల ముందు ఉండాలని నిర్ణయించుకున్నారు. ఈమేరకు తమ శక్తి సరిపోకున్నా కుమారుడి విగ్రహం కోసం రూ.3లక్షలు వెచ్చించేందుకు సిద్ధమయ్యారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో రూ.70వేలు వెచ్చించి వంశీ విగ్రహాన్ని ఫైబర్‌తో చేయించగా మరో రూ.2.30లక్షలతో ఇంటి ఆవరణలో ఇతర నిర్మాణాలు చేపట్టి మంగళవారం విగ్రహాన్ని ఆవిష్కరించారు. వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ తదితరులు విగ్రహాన్ని ఆవిష్కరించి వంశీ తల్లిదండ్రులను ఓదార్చారు.


వంశీ విగ్రహం వద్ద నాయకులు, తల్లిదండ్రులు